సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

కారుతో సహా రూ. 12 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్‌ఓ గురుప్రభాకర్ తెలిపారు. - 8లో



మనోహరం..మోహినీ స్వరూపం

వాల్మీకిపురం పట్టాభిరాముల వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 114 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

పనులు త్వరగా పూర్తిచేయాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న రాజ్యలక్ష్మి

సిద్దవటం : ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సిద్దవటం మండలం లోని కడప- చెన్నై ప్రధాన రహదారికి ఇరువైపులా పారుశుధ్య పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆమె భాకరాపేట, కనుమలోపల్లె గ్రామాల్లో జరిగే పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల్లో జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ విజయ భాస్కర్, ఈఓపీఆర్‌డీ మోహతాబ్ యాస్మిన్, పంచాయతీ కార్యదర్శులు రాజేష్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సుండుపల్లె : ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈడీ ఊరిమ్మిశ తెలిపారు. మండల కేంద్రంలోని చెత్త నుంచిసంపద తయారీ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి ఇంటి నుంచి తడి చెత్త - పొడి చెత్తను వేరు చేసి చెత్త నుండి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని, సేంద్రీయ ఎరువులను తయారు చేయాలని తెలిపారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి మస్తాన్‌వల్లి, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ సురేష్‌బాబు, రీసోర్స్ పర్సన్ మధు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సి.యామిని



కడప అర్బన్ : వైఎస్సార్ ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సి.యామిని నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జి. శ్రీదేవి అనంతపురంలోని ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ లేబర్ కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. కడపలోని ఆర వ అదనపు జిల్లా (ఫ్యామిలీ కోర్ట్) జడ్జిగా పనిచేస్తున్న షేక్ ఇంతియాజ్ అహ్మద్ విజయవాడ జిల్లా కోర్టులో 14 అదనపు జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా కోర్టులో పోక్సో కోర్టు జడ్జిగా పని చేస్తున్న ఎన్.శాంతి కడపలోని ఆరవ అదనపు జిల్లా జడ్జిగా నియమితులయ్యారు.

రిజిస్ట్రేషన్‌కు 19 స్లాట్ బుకింగ్‌లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ సేవలను మరింత సులభతరం చేసేందుకు స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అన్ని జిల్లాల్లో కేంద్రాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. కడప అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొత్త విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తికి దస్తావేజులను అందజేశారు. సోమవారం 19 స్లాట్ బుకింగ్‌చేసుకున్న వారికి దస్తావేజులను అందజేసినట్లు సబ్ రిజిస్ట్రార్ హరికృష్ణ తెలిపారు. కొత్త విధానంతో ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ఎక్కువ సమయం వృథా కాదని, ప్రజలు నిరీక్షించే బాధ తగ్గుతుందన్నారు. అలాగే క్యూఆర్ కోడ్‌తోనూ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ఈ మేరకు తమ కార్యాలయంలో క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంచామన్నారు.

కందిపప్పు.. కరువే!

- పండుగ సందర్భంలోనూ కనిపించని పూర్తి స్థాయి సరుకులు
- కూటమి సర్కార్ వచ్చిన తర్వాత రేషన్ సరుకుల్లో కోత



జిల్లాలో మొత్తం కార్డుదారులు	5,04,325
ఒక్కో వినియోగదారునికి అందే సరుకులు	2 రకాలు
జిల్లాకు అవసరమైన కందిబేడలు	495 మెట్రిక్ టన్నులు

సాక్షి రాయచోటి : కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ సరుకులకు కోత పడుతోంది. ప్రభుత్వం కుదిస్తుందో లేక కార్డుదారులకు నిత్యావసరాలు అవసరం లేదనుకున్నారో ఏమో తెలియదుగానీ నిత్యావసర సరుకుల విషయంలో మాత్రం వాత తప్పడం లేదు. వైఎస్సార్ సీపీ సర్కార్ హయాంలో ఎప్పుడూ సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలకు సంబంధించి నాణ్యమైన సరుకులతోపాటు చక్కెర, కందిపప్పు, బియ్యం, జొన్నలు, రాగులు అందించే పరిస్థితి కనిపించేది. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత కందిప్పు ధర పెరగడంతోపాటు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో సబ్సిడీపై అందించకుండా కోత పెడుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. జిల్లాలో సుమారు 5,04,325 కార్డుదారులు ఉన్నారు. జిల్లాలో దాదాపు రెండు నెలలుగా కందిపప్పు కనిపించడం లేదు. అధికమొత్తంలో ధర పలుకుతున్నాయి. ఇలాంటి తరుణంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు సబ్సిడీపై అందించాల్సి ఉంది. అయితే ఫిబ్రవరితోపాటు మార్చి, ఏప్రిల్ నెలల్లో కందిపప్పు అందించలేదని చెబుతున్నారు. ఒకనెలకు సంబంధించి జిల్లాకు 495 మెట్రిక్ టన్నులకు పైగా అవసరం ఉంటుంది. సరుకు రవాణా కాకపోవడంతో వీటికి ప్రభుత్వం ఎసరు పెట్టింది.జిల్లాలోని కార్డుదారులకు పూర్తిగా నిలిపివేయగా, అంగన్వాడీ కేంద్రాలకు మాత్రం కందిపప్పు అందించారు.

జిల్లాలో అంతంత మాత్రంగానే చక్కెర

జిల్లాలో చక్కెర కొంతమంది కార్డుదారులకు మాత్రమే అందింది. సబ్సిడీపై అందించే చక్కెరకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ప్రధానంగా పీలేరు నియోజకవర్గంలోని వాయల్పాడు ప్రాంతంలో డీలర్లు డీడీలు తీయకపోవడంతో చక్కెర అందలేదు. ఒక్క వాయల్పాడే కాకుండా మరికొన్నిచోట్ల కూడా చక్కెరకు సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఎన్నడూ లేని తరహాలో ప్రస్తుతం చిత్రమైన పరిస్థితి అక్కడక్కడ కనిపిస్తోంది.

పూర్తి స్థాయిలో కనిపించని సరుకులు

మార్చి చివరిలో వచ్చిన ఉగాది, ఏప్రిల్ మొదటి వారంలో వచ్చిన శ్రీరామనవమి పండుగ సందర్భంలో కూడా పూర్తి స్థాయిలో సరుకులు ఇవ్వలేదు. ఎన్నికలకు ముందు ముస్లిం సోదరులకు సంబంధించి పండుగ నేపథ్యంలో రంజాన్ తోఫా అందిస్తామని పేర్కొన్నా అదిఅమలుకు నోచుకోలేదు. ఇలా ప్రతిసారి ఏదో ఒక కారణంతో పండుగ సందర్భంలోనూ సరుకులు అందించకపోవడంపై కార్డుదారులు పెదవి విరుస్తున్నారు.

బియ్యం, చక్కెరకే పరిమితం



రేషన్ దుకాణాల్లో కేవలం బియ్యం చక్కెర మాత్రమే ఇస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కందిపప్పు, జొన్నలు, రాగులు, గోధుమలు, గోధుమపిండి, రాగిపిండి వంటివి అందించేవారు. ప్రస్తుతం కూటమి సర్కార్‌లో అవేమి అందడం లేదు. ప్రభుత్వ తీరు కారణంగా పేదలకు ఇబ్బందులు తప్పడం లేదు. – శివ నారాయణ, కొత్త మాదిగపల్లె, మద్దిరేవుల గ్రామం, లక్కిరెడ్డిపల్లె మండలం

ఇబ్బందులు తప్పడం లేదు



మాకు రేషన్ సరుకులకు సంబంధించి బియ్యం, చక్కెర ఇచ్చారు తప్ప కందిబేడలు ఇవ్వలేదు. గతనెలలో కూడా కందిపప్పు అందించలేదు. ఎందుకో తెలియదుగానీ ప్రతిసారి మాలాంటి పేదలకు అందించే సరుకుల విషయంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. బహిరంగ మార్కెట్ కందిపప్పు ధరలు అధికంగా ఉండడంతో కొనుగోలుకు ఇబ్బందులు తప్పడం లేదు. – యశోదమ్మ, పీలేరు

చక్కెర సమస్య లేదు

జిల్లాలో ఎక్కడా కూడా చక్కెర సమస్య లేదు. అన్నిచోట్లకు సరఫరా చేశాం. అన్ని నియోజకవర్గాల్లోనూ కార్డుదారులకు చక్కెర అందేలా చర్యలు తీసుకున్నాం. కందిపప్పు మాత్రం సరఫరా కాకపోవడంతో అందించలేకపోతున్నాం. – రఘురామ్, జిల్లా పౌరసరఫరాల అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

ఇంటర్‌లో సంస్కరణం



తరగతి గదిలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు

- విద్యావిధానంలో కూటమి ప్రభుత్వం మార్పులు
- నూతన విద్యా విధానంపై తల్లిదండ్రులు, విద్యార్థులు పెదవివిరుపు
- కొత్తగా ఎంబైపీసీ కోర్సు ఏర్పాటు
- నేటి నుంచి నూతన అడ్మిషన్లకు అనుమతి

మదనపల్లె సిటీ : ఇంటర్ విద్యలో 2025–26 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న నూతన సంస్కరణలు కార్పొరేట్ విద్యా వ్యవస్థకు అండగా మారనున్నాయి. ఈ సంస్కరణలు కార్పొరేట్ యజమాన్యాలకు అనుకూలంగా ఉన్నాయన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు ముగిశాయి. తాజా విద్యా సంవత్సరానికి సంబంధించి సోమవారం నుంచి అడ్మిషన్లు చేసుకోవచ్చునని ఇంటర్ బోర్డు అనుమతి ఇచ్చింది. కొత్త సిలబస్‌తో పాటు కోర్సులు అమల్లోకి రానున్నాయి. ఈ ఏడాది మొదటి సంవత్సరంలో ఎంపీసీ,బైపీసీతో పాటు ఎంబైపీసీ కొత్త కోర్సు ప్రవేశపెట్టారు. ఎంబైపీసీలో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులు ఉంటాయి. ఈ కోర్సు విద్యార్థులు నీట్‌తో పాటు జేఈఈ మెయిన్స్ పరీక్ష రాసే విధంగా అవకాశం కల్పించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యవస్థలను నిర్వీర్యం చేయడం, తన మార్కు చూపించుకునేందుకు పారదర్శకంగా, సాఫీగా సాగుతున్న వ్యవస్థల్లో సంస్కరణ పేరుతో గందరగోళానికి నాంది పలుకుతున్నారు. ఇందులో భాగంగా ఇంటర్మీడియట్ విద్యలో తీసుకొచ్చిన నూతన విధానాలతో తల్లిదండ్రులు, విద్యార్థులు సతమతమవుతున్నారు. ఏటా వార్షిక పరీక్షల అనంతరం విద్యార్థులకు సెలవులు ఇచ్చేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దీనికి మంగళం పాడింది. ఈనెల ఒకటోతేదీ నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించారు. ఎండ తీవ్రతతో కాలేజీలకు వెళ్లేందుకు విద్యార్థులు ఆసక్తి చేపడం లేదు. జిల్లాలో పలు కాలేజీలో హాజరు అంతంతమాత్రంగానే ఉంది. ఇంటర్ విద్య చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో ఇటువంటి సంస్కరణలు తీసుకురావడంపై విద్యావేత్తలు విస్తు పోతున్నారు.

ఇంటర్ విద్యా విధానంలో మార్చి నెలాఖరు వరకు పబ్లిక్ పరీక్షలు జరిగేవి. ఏప్రిల్ నుంచి మే నెలాఖరు వరకు సెలవులు ప్రకటించేవారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమయ్యేవి. నూతన విద్యా సంవత్సరం ఈనెల ఒకటోతేదీ తరగతులు ప్రారంభమయ్యాయి. నూతన విధానంతో విద్యార్థులు మానసిక వికాసానికి, సెలవులకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టెన్త్ ఫలితాలు రాకుండేనే అడ్మిషన్లు

ప్రస్తుతం పదో తరగతి ప్రశ్నపత్రాల మూల్యాంకనం జరుగుతోంది. ఇంకా ఫలితాలు విడుదల కాలేదు. ఈ ప్రక్రియ పూర్తి కాకుండానే ఈనెల 7వతేదీ (సోమవారం) నుంచి ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల షెడ్యూలు ప్రకటించారు. టెన్త్ ఫలితాలు వెలువడకముందే అడ్మిషన్లు ఎలాగని తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు లబ్ధి చేకూర్చేందుకు ఇలాంటి సంస్కరణలకు శ్రీకారం చుట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కళాశాలల పనిదినాలు సైతం మార్చారు. గతంలో ఏడాదికి 222 రోజులు నడుస్తుండగా దీనిని 235కు పెంచారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం నుంచే ఇంటర్ మొదటి సంవత్సరం సీబీఎస్‌ఈ సిలబస్ అమలు చేయనున్నారు. గతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఏడు పీరియడ్లు నడుస్తుండగా ప్రసుత్తం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు తరగతులు కొనసాగేలా ఇందులో 8 పీరియడ్లు ఉండేలా మార్పు చేశారు.

కార్పొరేట్ కాలేజీల మేలుకోసమే



ఇంటర్మీడియట్‌లో సంస్కరణలు తీసురావడం కేవలం కార్పొరేట్ కాలేజీల కోసమే. పదో తరగతి పరీక్ష ఫలితాలు రాకముందే అడ్మిషన్లు ప్రక్రియ చేపట్టడం అవివేకం. వేసవి సెలవుల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తరగతులు నిర్వహించడం తగదు. – మాధవ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి

దరఖాస్తు చేసుకోవాలి



ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి. పదో తరగతి పబ్లిక్ పరీక్ష హాల్‌టిక్కెట్టును జత చేయాలి. విద్యార్థులకు ఏ గ్రూపు ఆసక్తి ఉంటే ఆ గ్రూపులో చేరవచ్చు. – బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్,ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ,మదనపల్లె.

మనిషికి ఆరోగ్యం గొప్పవరం

రాయచోటి అర్బన్/రాయచోటి టౌన్ : మనిషికి ఆరోగ్యం గొప్ప వరం అని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ శైలజ అన్నారు. ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది పురవీధులలో నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ర్యాలీ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి నేతాజి సర్కిల్, డైట్‌కళాశాల, వైఎస్ ఆర్ సర్కిల్‌ల మీదుగా తిరిగి ఆసుపత్రి వద్దకు చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికే ఆరోగ్యం విలువ తెలుస్తుందన్నారు. సరైన సమ యంలో వివాహం చేసుకోవడం సంతోషానికి నిలయం అని అన్నారు. ఆసుపత్రి ప్రసవాలు తల్లిబిడ్డలకు ఆనందకరమన్నారు. హైరిస్క్ గర్భిణులు తప్పనిసరిగా ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే పెద్దల మాటలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్టు కోటేశ్వరి, డిప్యూటీడెమో దేవశిరోమణి, హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ నారాయణ, ఆరోగ్య పర్యవేక్షులు సుధాకర్, రవి,నాగమల్లయ్య, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.



రాయచోటిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది.



రాయంచపై రామయ్య విహారం

ప్రణమిల్లిన భక్తజనం

ఒంటిమిట్ట : ఏకశిలానగరిలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాత్రి 7 నుంచి 8:30 గంటలకు హంసవాహనసేవ వైభవంగా జరిగింది. రాములోరు రాయంచపై కొలువుదీరి మాఢవీధుల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రామా..మము బ్రోవుమా అంటూ భక్తజనం ప్రణమిల్లారు. ఆత్మానాత్మ వివేకం కలవానికి భగవదనుగ్రహం సంపూర్ణంగా కలుగుతుంది. హంస వాహనంలోని పరమార్థం ఇదే. హంసకు పాలను, నీళ్లను వేరుచేసే సామర్థ్యం ఉంది. భక్తుల్లో అహంభావం తొలగించి ×దాసోహం×అనే భావం కలిగించడానికే పరమహంస రూపానికి ప్రతీక అయిన హంస వాహనాన్ని స్వామి వారు అధిరోహిస్తారు. కోలాటం బృందం నృత్య ప్రదర్శనలు, తాళ భజనలు, మంగళవాయిద్యాలు ముందు సాగుతుండగా రాచఠీవితో హంస వాహనంపై నిలిచిన రాములవారు ఒంటిమిట్ట వీధుల్లో విహరించారు. వేలాది మంది తరలి రావడంతో రామయ్య క్షేత్రంలో భక్తజన సందడి నెలకొంది. అంతకు ముందు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వేణుగానాలంకారంలో స్వామివారు ఆలయ నాలుగు మాఢవీధుల్లో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 11 నుంచి కల్యాణవేదిక వద్ద ఉత్సవమూర్తులకు అభిషేకాలు జరిపారు. అనంతరం స్నపనతిరుమంజనం నిర్వహించారు.



గ్రామోత్సవంలో అలరించిన కోలాట ప్రదర్శన



హంస వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

నేటి కార్యక్రమాలు...

బ్రహ్మోత్సవాలలో మంగళవారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో శ్రీరాముడు దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 గంటల నుంచి సింహ వాహనంపై విహరిస్తారు.

కోదండరాముడి కల్యాణోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు

మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సవిత

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో ఏప్రిల్ 11న సీతారాముల కల్యాణోత్సవాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహిస్తామని, ఇందుకోసం ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయని రాష్ట్ర దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్ సవిత సంయుక్తంగా పేర్కొన్నారు. సోమవారం ఒంటిమిట్ట టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని పరిపాల భవన సమావేశ మందిరంలో వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్ కుమార్, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, టీటీడీ విజిలెన్స్ ఎస్పీ విష్ణువర్ధన్ రాజు, జేసీ అదితి సింగ్‌తో కలిసి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 11వ తేదీన సీతారాముల కల్యాణం వైభవంగా జరగనుందని, అందుకు సంబంధించి ఇప్పటికే దాదాపు అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులు అధికారులకు సూచించారు.ప్రజా భద్రత కోసం సుమారు 150కిపైగా సీసీ, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే కడప, రాజంపేట వైపు నుంచే ఆర్టీసీ బస్సులకు పార్కింగ్, అలాగే ఇతర జిల్లాల నుంచి ఎన్ని బస్సులు వస్తున్నాయో తెలుసుకొని పక్కాగా ప్లాన్ రూపొందించుకొని పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.మంత్రి సవిత మాట్లాడుతూ కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ప్రముఖులు అత్యంత ప్రముఖులు రావచ్చనే అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. కల్యాణవేదిక ప్రాంగణాన్ని భక్తులు శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. వైఎస్సార్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శానిటేషన్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, తాగునీటి వసతి కల్పించామన్నారు.108 వాహనాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వైఎస్సార్ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, టీటీడీ విజిలెన్స్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ టీటీడీ అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమష్టి కృషితో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గ్యాలరీ వద్ద గట్టి భద్రతా చర్యలు చేపడతామన్నారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం బ్రహ్మోత్సవాల విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని అధికారులను కోరారు.



కల్యాణ వేదిక ఏర్పాట్ల గురించి మంత్రులకు వివరిస్తున్న వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్

కల్యాణ వేదిక పరిశీలన

అంతకుముందు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, సవిత, జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఒంటిమిట్ట కోదండరామస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థానం సమీపంలోని కల్యాణ వేదికను వారు పరిశీలించారు. ఇక్కడ జరుగుతున్న ఏర్పాట్ల గురించి కలెక్టర్ మంత్రులకు వివరించారు. కార్యక్రమంలో కడప, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఇర్విన్, చిన్నయ్య, టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ నాగరాజు, డీపీఓ రాజ్యలక్ష్మీ, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ రమణయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మినరసయ్యకు షోకాజ్ నోటీసు అందజేసినట్లు కడప డీపీఓ రాజ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాధవరం–1 గ్రామ పంచాయతీలోని ప్రధాన రహదారిలో పారిశుధ్యం పనులు చేపట్టడంలో విఫలమయ్యారని, తన విధులను సక్రమంగా నిర్వహించలేదనే కారణంతో 1991 నిబంధనల ప్రకారం పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన బీటెక్ విద్యార్థి మృతి

మదనపల్లె : ఆత్మహత్యకు యత్నించి చెన్నై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బీటెక్ విద్యార్థి మృతి చెందినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఎగువకురవంకకు చెందిన శివప్రసాద్, కవిత దంపతుల కుమారుడు బండి నితీష్‌రాజు(21) మిట్స్ కాలేజీలో బీటెక్ రెండో ఏడాది చదువుతున్నాడు. మూడు సంవత్సరాలుగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బయటి ఆహార పదార్థాలు తీసుకోవద్దని డాక్టర్లు సూచించారు. ఈ విషయాన్ని లెక్కపెట్టకుండా కుటుంబ సభ్యులు వారించినా బయటి ఆహార పదార్థాలు తినడంతో అనారోగ్యం తిరగబెట్టింది. దీంతో మార్చి 28న కుటుంబ సభ్యులకు తెలియకుండా పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన వారు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తొలుత తిరుపతికి అక్కడి నుంచి చెన్నై ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

తంబళ్లపల్లె : పేకాట స్థావరంపై దాడి నిర్వహించి ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్.ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అన్నగారిపల్లె పంచాయతీ చింతలరేవుపల్లి సమీప తిరగరాళ్లగుట్టలో ఆదివారం పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసు సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.15,860 నగదు, అక్కడే ఉన్న 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ఎనిమిది మంది పరారయ్యారన్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

పొగాకు కొనుగోలుకు ముందుకొచ్చిన జీపీఐ కంపెనీ

బి.కోడూరు : మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పొగాకు కొనుగోలుకు ఎట్టకేలకు జీపీఐ కంపెనీ ముందుకు వచ్చింది. మండల రైతుల నుంచి ఒత్తిడి అధికం కావడంతో సోమవారం నుంచి పొగాకును కొనుగోలుకు కంపెనీ సిద్ధమైంది.

మనోహరం.. మోహినీ స్వరూపం



పుష్పపల్లకిలో మోహినీ అవతారుడైన పట్టాభిరాముడు



సూర్యప్రభ వాహనంపై సీతారాముల నగరోత్సవం

- సూర్య, చంద్రప్రభ వాహనాలపై సీతారాములు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కలికిరి(వాల్మీకిపురం) : పుష్పాలంకృతమైన వాలు జడ, నుదుటన బొట్టు, కాటుక తిలకం.. సాక్షాత్తూ మోహినీ స్వరూపంలో చూడచక్కని శ్రీరామచంద్రుడి దివ్య రూపాన్ని దర్శించుకున్న భక్తులు తన్మయత్వంతో పులకించిపోయారు. వాల్మీకిపురం పట్టాభిరాముల వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం విశేష కార్యక్రమాలతో ఆలయ పరిసర ప్రాంతాలలో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచి మూలవర్లకు నిత్య కైంకర్యాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. భోగోత్సవ మూర్తులైన శ్రీ సీతారామలక్ష్మణులను విశేష అలంకరణలతో తొలుత ఉదయం సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. విశేష భక్తజనం, వేద మంత్రోచ్చారణల నడుమ స్నపన తిరుమంజనం, సాయంత్రం స్వామివారి మండపంలో ఊంజల్ సేవ జరిగాయి. సాయంత్రం తిరిగి భోగోత్సవమూర్తులు చంద్రప్రభవాహనంపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. అనంతరం రాత్రి విశేష పూలాలంకృతులతో తీర్చిన పుష్పపల్లకిలో సాక్షాత్తు మోహినీ స్వరూపుడైన పట్టాభిరాముడు పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చాడు. నాయీ బ్రాహ్మణ సంఘం వారి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాల కుమార్, ఆలయ అధికారి కృష్ణమూర్తి, అర్చకులు కృష్ణప్రసాద్, కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం.. గరుడ సేవ

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ సీతారాముల కల్యాణోత్సవం, గరుడ సేవ కార్యక్రమాలు అలరించనున్నాయి. కాగా యావత్ దేశ వ్యాప్తంగా శ్రీరామనవమి పండుగ రోజు కల్యాణ వేడుకలు జరుగుతుండగా, వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో అమ్మవారి నక్షత్రంలో కల్యాణ వేడుకలు జరుపనుండటం విశేషం.

ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి : పేదోడికి పెద్దరోగం వస్తే రూపాయి ఖర్చు లేకుండా వైద్యం అందించాలన్న లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన ఆరోగ్యశ్రీ పథకాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం రాయచోటిలో పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీ పథకాన్ని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంగా పేరు మార్చారేగానీ పథక అభివృద్ధికి కృషి చేయడం లేదన్నారు. సేవలు అందించే నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ. 3600 కోట్లు బకాయిలను చెల్లించ లేదన్నారు. దీంతో మరోసారి నెట్‌వర్క్ ఆసుపత్రులు ఈనెల 7వ తేదీ సోమవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలుపుదల చేయడంతో ఉచిత వైద్యంకోసం వెళ్లే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయిలను చెల్లించి ఆసుపత్రుల యాజమాన్యాల సమ్మెను విరమింపజేయాలని కోరారు.

ఆరోగ్య ఆసరాకు మంగళం

ఆరోగ్య ఆసరాకు కూటమి ప్రభుత్వం మంగళం పాడిందని శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని గత జగన్ ప్రభుత్వం మరింత బలోపేతం చేసిందన్నారు. 1059 జబ్బులకు చికిత్సలు, శస్త్ర చికిత్సలు ఉండగా జగన్ పాలనలో 3257కు పెంచారన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పథకం కోసం 17 ఏళ్లుగా పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన కోరారు.

రికార్డింగ్ డ్యాన్సు చేయించారని ఇద్దరిపై కేసు

కురబలకోట : మండలంలోని ఎగువ చెన్నామర్రి సమీపంలో సోమవారం రికార్డింగ్ డ్యాన్సు వేయించారని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

ఎగువ చెన్నామర్రికి చెందిన కూని నరసింహులు, పత్రవారిపల్లెకు చెందిన మహేష్‌ను డీజే పాటలతో హిజ్రాలతో డ్యాన్సు వేయించారని వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డీజే వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. రానున్న తెట్టు పాలేటి గంగమ్మ జాతరలో కూడా రికార్డింగ్ డ్యాన్సులను నిషేధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుని ఇంటిలో చోరీ

ఇంటి తాళం పగులగొట్టి..
బంగారు, వెండి ఆభరణాలు అపహరణ



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

బి.కొత్తకోట : ప్రభుత్వ ఉపాధ్యాయులైన భార్యాభర్తలు రాయచోటిలో పదవ తరగతి స్పాట్ వాల్యూయేషన్ కోసం వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేరని నిర్ధారించుకున్న దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన సోమవారం తెల్లవారుజాము బి.కొత్తకోట సంతబజారువీధిలో జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు.. స్థానిక సంతబజారులో నివాసం ఉంటూ బీరంగిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్, పీటీఎం మండలంలో పనిచేస్తున్న ఆయన భార్య అనిత ఇద్దరూ ఈనెల 3వ తేదీనుంచి రాయచోటిలో పదవ తరగతి జవాబు పత్రాలను దిద్దేందుకు వెళ్లారు. సోమవారం ఉదయం పక్కింటిలో ఉంటున్న మునీర్ నుంచి కిరణ్‌కుమార్‌కు ఫోన్ వచ్చింది. ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని చెప్పడంతో ఆయన ఇంటికి చేరుకున్నారు. దుండగులు ఇంటికి వేసిన తాళాలను గడ్డపారతో పగులగొట్టి లోపలికి వెళ్లారు. బీరువా, లాకర్‌ను పగులగొట్టి అందులోని బంగారు, వెండి నగలు, డాక్యుమెంట్ పత్రాలను దోచుకున్నారు. మార్కెట్‌లో ప్రస్తుత విలువ ప్రకారం రూ.22 లక్షల విలువజేసే 250 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.5 లక్షల విలువజేసే ఐదు కిలోల వెండి ఆభరణాలు, దేవుడికి సంబంధించిన వస్తువులను ఎత్తుకెళ్లారు. రూ.20 వేల నగదు చోరీ చేశారు. ఈమేరకు బాధితుడు కిరణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై రాయచోటి నుంచి క్లూస్ టీం చోరీ జరిగిన ఇంటిలో దొంగల వేలిముద్రలను సేకరించారు. కాగా బంగారు, వెండి ఆభరణాలను కొనుగోలు చేసిన విలువ మేరకు రూ.2.25 లక్షలు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కారు సహా రూ. 12 లక్షల ఎర్రచందనం స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న ఫారెస్ట్ అధికారులు

పీలేరు : కారుతో సహా రూ. 12 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎఫ్ఓ గురుప్రభాకర్ తెలిపారు. శేషాచలం అడవుల నుంచి తమిళనాడుకు అక్రమంగా ఎర్రచందనం రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారంతో సోమల మండలం కందూరు వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం కలికిరి వైపు నుంచి కందూరు వైపు అతివేగంగా వెళుతున్న కారును సిబ్బంది ఆపే ప్రయత్నం చేయగా వేగంగా ముందుకు వెళ్లిన కారును ఫారెస్ట్ సిబ్బంది వెంబడించారన్నారు. ఇరిగిపెంట గ్రామం ఎర్రనాగులపల్లె వద్ద పట్టుకుని కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన సయ్యద్ ఆరీఫ్ అహ్మద్‌ను అరెస్ట్ చేసి కారుతో పాటు 255 కేజీల బరువు గల ఎనిమిది ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్ఓ తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది చంద్రశేఖర్, ప్రతాప్, నరేష్, చరణ్, దేవేంద్ర పాల్గొన్నారు.

సమస్యలు ఆలకించండి సారూ.!

- సబ్ కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- అర్జీలు స్వీకరించిన సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : 'దూరప్రాంతాల నుంచి వచ్చాం..మా సమస్యలు పరిశీలించి న్యాయం చేయండి..సారూ' అని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అధికారులను వేడుకున్నారు. సబ్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు అందజేసిన వినతులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

దాన సెటిల్‌మెంట్ దస్తావేజు రద్దు చేయాలి

పీలేరు నియోజకవర్గం, కే.వీ.పల్లె మండలం గ్యారంపల్లె సంకేతిగుట్టపల్లెకు చెందిన ఎగువపల్లె రాజారెడ్డి, తన మనవళ్లకు దాన సెటిల్‌మెంట్ కింద రాసిచ్చిన 7.49 ఎకరాల భూమికి చెందిన దస్తావేజులను రద్దుపరచాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ప్రస్తుతం వృద్ధాప్యంలో తనను ఎవ్వరూ చూడటం లేదని, ఇంటిలో కదలలేని స్థితిలో ఉన్న తనకు న్యాయం చేయాల్సిందిగా అభ్యర్థించారు.

ఆర్ఓ ప్లాంటుకు స్థలం కేటాయించండి

నిమ్మనపల్లె మండలం అగ్రహారంలో తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండటంతో గ్రామస్తుల ఆరోగ్యం దృష్ట్యా ఆర్ఓ ప్లాంటు ఏర్పాటు చేయాలని పంచాయతీ తీర్మానించింది. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న గ్రామచావిడిలో ఆర్ఓ ప్లాంటు ఏర్పాటుకు సర్పంచ్ ఉషారాణి ఆధ్వర్యంలో పంచాయతీ సభ్యులు తీర్మానించి తహసీల్దార్ అమరనాథ్‌కు అర్జీ సమర్పించామన్నారు. అయితే నెల రోజులవుతున్నా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదన్నారు.

దారికి అడ్డుగా అక్రమ నిర్మాణాలు



పెన్షన్ ఇప్పించాల్సిందిగా వేడుకుంటున్న వృద్ధురాలు వెంకటరమణమ్మ

మదనపల్లె మండలం పొన్నూటిపాలెంలో సర్వే నెంబర్ 420లో అక్రమ నిర్మాణాలు చేస్తూ, ఇతరులకు దారి లేకుండా చేస్తున్నారని బోయపాటి శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయించాల్సిందిగా అర్జీ సమర్పించారు.

వృద్ధాప్య పెన్షన్ ఇప్పించండి

తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె గ్రామం, రాగమానుదిన్నెపల్లెకు చెందిన వెంకటరమణమ్మ...తన భర్త వెంకటస్వామి రెండేళ్ల క్రితం మరణించారని, తమకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని చెప్పింది. వృద్ధాప్యంలో ఉన్న తన సంరక్షణ ఎవరూ చూడటం లేదని, తనకు వృద్ధాప్య పెన్షన్ ఇప్పించాలని వేడుకుంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన రామాంజనేయులు

ములకలచెరువు : ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సత్యసాయి జిల్లా రాప్తాడు మండలం బండమీదపల్లెకు చెందిన దాసరి రామాంజనేయులు(45), మత్యాలు(42)లు ద్విచక్రవాహనంలో తిరుపతి జిల్లా చంద్రగిరి ఎల్లమ్మ ఆలయానికి వెళ్తుండగా ములకలచెరువు బైపాస్‌లో కదిరి వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రస్థానం ప్రారంభమై..



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమాదేవి

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమాదేవి కర్నూలులో డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామం కావడంతో కర్నూలు జిల్లాలో ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఆమె భర్త పోలీస్ అధికారిగా ఈ మధ్యకాలంలోనే పదవీ విరమణ పొందారు. వీరికి ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు. వీరు పీలేరులో స్థిరనివాసం చేసుకున్నారు. పదోన్నతిపై అదే జిల్లాలో తహసీల్దార్‌గా పని చేసి తరువాత వైఎస్సార్ జిల్లా ముద్దనూరు, సీకే దిన్నెలో తహసీల్దార్‌గా పని చేశారు. అక్కడి నుంచి ఆర్‌డీఓగా పదోన్నతి పొంది హెచ్ఎన్ఎస్ఎస్ (హంద్రీనీవా) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమానికి పీలేరు నుంచి వస్తుండగా ఆమె సంబేపల్లె – రాయచోటి మార్గ మధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ సంతాపం

రోడ్డు ప్రమాదంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డిలు సంతాపాన్ని తెలిపారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన్ రావు, ఆర్డీఓ శ్రీనివాసులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె మరణంతో జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమం వాయిదా పడింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న రెవెన్యూ అధికారులు విధి నిర్వహణలో ఆమెతో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి మరణంతో అన్నమయ్య జిల్లా రెవెన్యూ శాఖలో విషాదం అలుముకుంది.

ప్రజా ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యం



బాధితుల వద్దకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని చట్టపరిధిలో విచారించి న్యాయం అందించడానికి అన్నమయ్య జిల్లా పోలీసు శాఖ సిద్ధంగా ఉంటుందని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం రాయచోటిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలపై స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. సబ్ డివిజన్, సర్కిల్ పరిధి, పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలన్నారు.

బాధితుల వద్దకు ఎస్పీ..

నడవలేని స్థితిలో జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ఇద్దరు వృద్ధులు, ఓ దివ్యాంగురాలి వద్దకే ఎస్పీ వెళ్లి ఫిర్యాదులు తీసుకున్నారు. వారి ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

గాయపడిన కానిస్టేబుల్ మృతి



జయప్రకాష్ (ఫైల్)

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ సోమవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు. చౌడేపల్లి మండలం బయ్యప్పపల్లికి చెందిన టి.జయ ప్రకాష్ (పిసి నెంబర్ 3694) మదనపల్లె పట్టణంలోని నిమ్మనపల్లె రోడ్డు పసినికొండలో నివాసం ఉంటూ, తాలూకా పోలీస్ స్టేషన్‌లో మూడేళ్లుగా కోర్టు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తన కుమారుడు భవేష్(04) అనారోగ్యానికి గురి కావడంతో భార్య కిరణ్మయితో కలిసి శనివారం బెంగళూరుకు చికిత్స నిమిత్తం వెళ్లాడు. అక్కడ తన బంధువులకు చెందిన ద్విచక్ర వాహనంలో ఆసుపత్రి అవసరాలపై వెళుతుండగా, ఎదురుగా వచ్చిన మరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయాలై అపస్మారక స్థితికి చేరుకోవడంతో బంధువులు బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం స్వల్పంగా కోలుకోవడంతో కుటుంబ సభ్యులు జయప్రకాష్‌ను తిరుపతి నారాయణాద్రి హాస్పిటల్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. కానిస్టేబుల్ జయప్రకాష్ మృతి చెందిన సమాచారం తెలియడంతో తాలూకా పోలీస్ స్టేషన్ సీఐ కళా వెంకటరమణతో పాటు ఎస్ఐలు చంద్రమోహన్, గాయత్రి, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

నేటి నుంచి బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీసు క్యాంపులు

మదనపల్లె సిటీ : కస్టమర్స్ సర్వీసు మాసం పురస్కరించుకుని బీఎస్ఎన్ఎల్ డివిజన్ కేంద్రంలో కస్టమర్ సర్వీసు క్యాంపులు నిర్వహించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ డీఈ ఆబిద్‌అలీ తెలిపారు. మంగళవారం నుంచి ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్యాంపుల ద్వారా కస్టమర్లు తమ సేవల ద్వారా ఎదుర్కొంటున్న సమస్యలు, ఫిర్యాదులను సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి క్యాంపు వద్ద బీఎస్ఎన్ఎల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రత్యేకంగా సిగ్నల్, ఫైబర్ కనెక్షన్ వంటి సాంకేతిక సమస్యలు పరిష్కరిస్తారన్నారు.

సెకండ్ కార్స్ యజమాని మోసం..

మహిళ ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సునీత

మదనపల్లె : మీ పేరుపై కార్లు కొన్నానని, లక్షల్లో నగదు వసూలు చేసుకుని, సెకండ్ కార్స్ యజమాని మోసం చేయడంతో, మనస్థాపం చెందిన ఓ మహిళ కెమికల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం మేలుపట్ల గ్రామానికి చెందిన నారాయణస్వామి భార్య సునీత (45) తన కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించేందుకు, సెకండ్ హ్యాండ్ కార్లు కొనాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగా మదనపల్లె పట్టణం పుంగనూరు రోడ్డులో హరి కార్స్ యజమాని హరికృష్ణను సంప్రదించింది. ఆమె కుటుంబ సభ్యుల పేరుపై కార్లు కొంటానని నమ్మ పలకడంతో, విడతల వారీగా రూ. 15 లక్షల నగదు అతనికి ముట్టచెప్పింది. డబ్బు తీసుకున్న హరికృష్ణ కార్లు వారికి కొని ఇవ్వకుండా, మీ పేరు పై కార్లు కొన్నానని బాడుగలకు వెళుతున్నాయని నమ్మబలికాడు. కొన్ని రోజులు వేచి చూసిన సునీత తమ పేరుపై ఉన్న కార్లకు సంబంధించిన ఆర్‌సీ బుక్కులు చూపించాలని పట్టుబట్టింది. దీంతో హరికృష్ణ ఆర్సీలు పంపాడు. అయితే అవి సునీత కుటుంబ సభ్యుల పేరుపై లేకపోవడంతో తాము మోసపోయామని గుర్తించింది. ఆరు నెలలుగా తీసుకున్న నగదు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేసింది. ఇవ్వకుండా కాలయాపన చేస్తుండడంతో, సోమవారం మధ్యాహ్నం నగదు వసూలుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి మదనపల్లె లోని హరి కార్స్ వద్దకు వచ్చింది. డబ్బు చెల్లించాలని హరికృష్ణను గట్టిగా అడిగింది. అయితే హరికృష్ణ నగదు చెల్లించకపోగా తన అనుచరులతో కలిసి ఆమెను దుర్భాషలాడుతూ దాడి చేశాడు. అయినా ఆమె వినకుండా షాపు వద్దే రాత్రి వరకు కూర్చుంది. దీన్ని భరించలేని హరికృష్ణ ఆమెను తిడుతూ ఎక్కడికైనా వెళ్లి చావు అన్నాడు. దీంతో ఆమె అక్కడే ఉన్న కార్ కెమికల్ ఒంటిపై పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈలోపుగా సునీత ఇంటికి వెళ్లకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని ఆసుపత్రికి తరలించారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి

లక్కిరెడ్డిపల్లి: గ్రామాలలో తాగునీటి సమస్యపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ మైథిలి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చౌటపల్లి దళితవాడ, దప్పేపల్లి, కొండవాండ్లపల్లి గ్రామాలలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉషారాణి, పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యంలతో కలిసి జిల్లా పరిషత్ గ్రాంట్‌కు సంబంధించి తాగునీటి బోర్లను, పలు రికార్డులను పరిశీలించారు. జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.